# రైతుకూలీ రాజ్యంలో వెంకడు

( క థా నిక )

"రంగ మెల్లి పోదాం పదరా, ఈడే ముండాది? పొద్దస్తమానం చాకిరి చేత్తే ముంతెడు గంజేనా లేదు?"

వెంకడు ఆలోచనలో పడ్డాడు. భార్య చెప్పిన ఆలోచన బాగానే ఉంది. నాలుగేండ్ల క్రితం గూడెం విడిచి రంగూనుకు పోయిన సుబ్బి, రాగడు వాళ్ళకంటే బాగానే బ్రతుకుతున్నారు."

ఐతే - ఇరవై సంవత్సరాలుగా చేస్తున్న రామశాస్త్రిగారి పొలం విడిచిపోవలసిందేనా? బీడులాంటి పొలాన్ని కష్టపడి సుక్షేత్రం చేశాడే, ఉప్పుతో ఊరకెత్తిన పర్రని చెమటోడ్చి మంచి మాగాణిగా మార్చాడే, కనిమెల దగ్గర తగాదా వస్తే వీర విహారం చేసి రక్తం చిందించి ఆకారాన్ని అపర్చాడే, ఆ పంట భూమిని వదిలిపోవాలిసిందేనా?

వెంకడికి పచ్చని పైరు కనిపించింది ఏపున పెరిగి నలువుకు తిరిగిన ఆకుల గలగల వినిపించింది.

మరు క్షణంలో, తిన తిండిలేక కట్ట గుడ్డలేక ఆకలికి అలమటించిపోయే ఆడది, పిల్లలు జ్ఞాపకమొచ్చారు. కరిగిపోయిన కండలు, అరిగిపోయిన చేతులు, విరగనున్న ఎముకలతో ఆడది దీనంగా చూసింది. రంగూను వెళ్ళి పొన్నకాయలా తేలిన సుబ్బి తళ్ళుక్కున మెరిసింది. గట్టిగా నిట్టూర్చి గబగబా నడిచాడు. రామశాస్త్రి గారి గడపదగ్గర నిలిచాడు.

"అమ్మగోరూ!"

"ఇప్పుడే మొచ్చావ్."

"గంజి కాసుకోను గింజలు లేవు. పిల్లలు అలమటించి పోతుండారు. సోలెడు నూకలిప్పియ్యండమ్మా."

"నూకలా? నిన్ననేగా పిండికొట్టావు. తెల్లవారేసరికి ఎలా వస్తాయ్" అంటూ ఆమె తలుపు మూసింది. వెంకడి హృదయ కవాటం తెరచుకొంది. ఆకలి మంటలు భగభగమన్నాయ్. గిరుక్కున వెనక్కి తిరిగి గూడెం కేసి నడిచాడు.

అక్కడ——

"అందరికీ అన్నం, అందరికీ బట్ట, అందరికీ ఆరోగ్యం-అదే ప్రజా రాజ్యం-భూమి దున్నే వాడికే ఇవ్వాలి, ఘోరమైన ఆహార సమస్య నెదుర్కోవాలి, అధికాహారోత్పత్తికి కృషి చెయ్యాలి-భారతంలో రైతుకూలి ప్రజారాజ్యం వర్థిల్లాలి. మీ వోటు రంగరామచౌదరికే ఇవ్వాలి" కేకలేస్తున్నారు. పిడికిలి బిగపట్టి గాలిలో గ్రుద్దుతున్నారు. మహాత్మాగాంధీకి జై. వారికి జై వీరికి జై అంటున్నారు. తోలు సంచులు చేత పట్టుకొని ముందుకుపోతున్నారు.

వెంకడు అన్నీ విన్నాడు. ఓ నిమిషం ఆలోచించారు. కళ్ళద్దాల ఖద్దరు లాల్చీ పెద్ద మనిషిని నిలిపాడు.

"దున్నేవాడికి పొలం ఏడుండాది? అందరికీ గుడ్డేదీ? నాకు కూడేదీ? రగతం పిండి పంటలు పండించే మాకు గంజికేనా గతిలేకపోతే కూలిరాజ్యమేంది?" ఉద్రేకంతో వెంకడు వణకిపోతున్నాడు.

కాఫీ హోటల్లో తెగతిన్న ఆ పెద్దమనిషి త్రేపి, చేతిలోని తోలుసంచి చంకన పెట్టి కళ్ళద్దాలు సవరించుకుంటూ, "ఇది రైతుకూలి ప్రజా రాజ్యం కాదు. ఇది బూర్జ్వా కాంగ్రెసు ప్రభుత్వం. నీ వోటు రంగరామ చౌదరికిస్తే నీ కవన్నీ వస్తాయి. ఇదిగో - ఇంకో మాట. కిష్టప్రక్కన అనాక్రమిత భూములున్నాయి చూడు. కొంత భాగం ఆక్రమించుకో - అధికాహారోత్పత్తి శాఖవారికి అర్జీ పెట్టుకో, భూమిని చీల్చి పంట పండించు" మహోపదేశం చేసి సిగరెట్టు పొగ పీలుస్తూ ముందుకు నడి

"సుబ్బన్న"

చాడు ఆ దేశభక్తుడు, ప్రజా సేవకుడూను. వెంకడు గుడిసెలోకి నడిచాడు. తట్ట బుట్ట సర్ది ఆడదాని నెత్తిన పెట్టాడు. ఎడచంటిదాన్ని చంక నేసుకొని పార పలుగు బుజాన పెట్టుకొని "పద" అన్నాడు.

"ఏడకిరా, కూడు లేక సత్తుంటే?"

"కూడూ గుడ్డ అన్నీ వత్తాయి రా. దున్నే వాడిదే కయ్య."

"ఏడ?"

"రైతు కూలి పెజారాజ్యంలో రాయతా!"

* * *

కట్టే కంపా కొట్టేశాడు. అక్కడక్కడ అను వైనతుమ్మ కొయ్యలుంచి మొక్కా డొక్కా లాగేశాడు. మెరకలు నరికి పల్లాలు పూడ్చి నాలుగెకరాలు భూమిని చదును చేశాడు. కృష్ణమ్మ తల్లికి దణ్ణం పెట్టి ఆడదాని మెళ్లోని పుస్తె కాస్తా తెగనమ్మి తగుపాటి సామాగ్రి కూర్చుకొన్నాడు. రేయనక పగలనక పనిచేసి గనిమెలు వేసి కంప ఫాతి హద్దు లేర్పరుచుకొన్నాడు.

పేదవాడి పాటుకు కృష్ణమ్మతల్లి హృదయం కరిగింది. బిడ్డసాహసాన్ని హర్షించి ఆనందంతో పొంగి పొర్లింది. వెంకడి హద్దులన్నీ మాయమై పోయినాయి. తెల్లవారేసరికి చదునుచేసిన చేను కాస్తా నీటిక్రిందికిపోయింది.

నీరు తీసేవరకు వెంకడు ఆడది మొదలెట్టిన పనిలో ప్రవేశించాడు. గుడిసెచుట్టూ నాటిన చెట్లపాదులకు అల్లులు అమర్చాడు. గొడ్డు గోదా రాకుండా తగిన బందోబస్తు జేశాడు. సొర పాదును గుడిసెక్కించి పొట్ల పాదుకు పందిరి వేశాడు, తోటకూరమళ్లు త్వరగా పైకొచ్చాయి. తలలుగిల్లి పడిగట్టుకొని ఆడది రోజా సోలెడు గింజలు తెస్తోంది.

నీరు తీసింది. పొలంనిండా ఒండు పేరుకొని వుంది. వెంకడి హృదయం ఊరక లేసింది. తిరుగా గనిమలు లాగి కంప నాటాడు.

ప్రచండ భానుని కిరణ వాడికి తాళలేక మాగధలాంటి ఒండు పొరపగిలి బీటలువారింది. ఈలోగా వెంకడు సిసలైన విత్తనాలు సంపాదించాడు. సకాలంలో పడ్డ వర్షపు జల్లుకు బీటలుపారిన ఒండుపొర పెటపెటలాడింది. పొగలు గ్రక్కింది. గుప్పున వాసన కొట్టింది. సాని పదును తేలింది. వెంకడు పార పట్టుకొని పనిచేశాడు. గింజలుచల్లి మొలకెత్తించి, అరక కట్టి, ఆకూడ్చి ఆనందపడ్డాడు. ఒకమాటు పొలమంతా కలియజూసి కొరమీసం కొనలు తిప్పి కృష్ణలో కాళ్ళు కడిగి, పుక్కిలించి రెండు చేతులూ జోడించి,

"అమ్మా, ఇది దున్నేవాడి పొలం" అన్నాడు. కలకలు తేరిన కృష్ణనీరు వెంకడి కాళ్ళకు చుట్టుకొంటూ "అలాగా!" అన్నట్లు ప్రవహించింది.

కుప్పనూర్చి నాలుగుపుట్లు ధాన్యం గుడిసె గురి వేశాడు. వెంకడి ఆనందానికి అంతులేదు. అదివరకు వాడు దానికి ఐదు రెట్లు పంట పండించేవాడు. ఐతే అది రామశాస్త్రిగారికి వప్పగించి దణ్ణంపెట్టి చక్కా వచ్చేవాడు.

వెంకడి దండలు కండలు తిరిగినాయ్. ఆడదాని ముఖం కళకళ మంటూంది. కంటికి కాటుక దిద్ది తలకు చమురుకూడా రాస్తోంది. పిల్లలు బొద్దుగా ముద్దుగా ఎదుగుతున్నారు. వంటినిండా గుడ్డ కట్టుకుని వెంకడు కంటి నిండా నిద్రపోతున్నాడు.

రెండుపుట్ల ధాన్యం అమ్మి సొంతానికి ఓ అరక కొన్నాడు. మిగతా డబ్బుతో సంవత్సరానికి సరిపడ సరంజామా అంతా కూర్చుకొన్నాడు.

ఆడది కొత్త బియ్యంతో వండిన పాయసం సేతికిచ్చింది. ఆనందంతో అందుకొన్న వెంకడు "రంగ మెల్లిపోదామా?" అన్నాడు.

"ఆడ కూలి దొరికినా కూడు దొరకడం లేదురా" అన్నది ఆడది.

కొత్త అరక వెంకడి చేతిక్రింద జోరుగా పని చేసింది. ఆ సంవత్సరం ఆ నెలమీద ఆరు పుట్లు పండించాలనుకొన్నాడు వెంకడు. మట్టి నలిపి రుచిచూసి బంగారం పండుతాది అనుకొనే సమయంలో —

పొడుగాటి జుబ్బాలవారు, పొట్టి మీసాలవారు, ఖద్దరు టోపీలవారు కొంతమంది రెవిన్యూ అధికారులతో సహా వచ్చి నాలుగు దిక్కులా పరికించి అదీ ఇదీ మాట్లాడి "అంతేలెండి" అనుకొంటూ వెళ్ళిపోయినారు. వెంకడి

కేమీ అర్థం కాలేదు. కాని వాడికి, ఒకనాడు: "దున్నేవాడికే భూమి - అధికంగా ఆహారం పండించి రైతు కూలి ప్రజారాజ్యం స్థాపించాలి" అని మహోపదేశం చేసిన కళ్ళద్దాల మహాత్ముడు జ్ఞాపకమొచ్చాడు. వారిలో ముందు నడిచేవారు ఆయనే అని వెంకడు గుర్తించేసరికి ఆ ప్రజాసేవకుడు దూరమై పోయినాడు.

కష్టపడి పనిచేసిన వెంకడు మయిమరచి నిద్రపోయేవాడు. కాని ఆరాత్రి వాడికి నిద్ర పట్టలేదు. అర్థరాత్రివేళ లేచి చేనుమధ్యకు పోయి దున్ని విడగొట్టిన మట్టిమీద కూర్చున్నాడు. వాడికి భయంవేసింది. మెత్తగా నలిగిన మట్టిమీద బోర్లగా పడుకొని చేతులు మట్టిలోకి గ్రుచ్చి రెండు గుప్పెళ్ళతోటి గట్టిగా పట్టుకొన్నాడు.

"నాది, ఈ కయ్యనాది" అని గట్టిగా అరిచాడు. భోరున ఏడ్చాడు.

నిద్రలో చంటిపిల్ల "కావ్"మన్నది. ఆడది జోకొట్టినా ఊరుకోలేదు. లేచి భుజాన వేసుకొని చల్లగాలిలో తిరుగుతూ, వెంకడు ప్రక్కమీద లేకపోవటం గమనించింది. కాసేపు చూచి ఎలుగెత్తి కేక వేసింది. ఎదురు కేక లేదు. నేరుగా పొలానికి నడిచింది. వెంకడు మట్టిలో పడి ఏడుస్తున్నాడు. ఆడదానికి అదురు పుట్టింది.

"ఇదేందిరా!" వెంకణ్ణి తట్టింది.

"నాది. ఈ కయ్య నాది" గాద్గదికంగా అరుస్తున్నాడు.

"నీదేరా. నీది గాక ఇంకోరిది? ఎవడెబ్బ దీన్ని బాగుచేశాడు? ఈ కయ్య మందేరా."

"దొంగలు- ఈ కయ్య దొంగిలికుపోతారు."

"పిచ్చా ఏంరా? కయ్య కదుల్తాదా, మెదుల్తాదా? దొంగిలుకు పోడానికి. లేరా?" అన్నది. వెంకణ్ణి లేపి మట్టి దులిపి గుడిసెకు నడిపించుకుపోయింది.

ఆ మరునాడు, ఫలానా ఫలానా నెంబర్లుగల సర్కారు భూమి, రాజకీయ బాధితులకు మంజూరు చేయడమైనది - అని అధికారులు ప్రకటించారు. అందులో వెంకడి అనుభవంలో ఉన్న నాలుగెకరాలు దానికి ఈశాన్యంగా వాడి క్రిందనున్న డెభై ఆరో నెంబరులో ఒక ఎకరం, వెరశి ఐదెకరాలు - ఉప్పుసత్యాగ్రహం సందర్భంలో రెండు లాఠీ దెబ్బలు తిని, వ్యక్తి సత్యాగ్రహ సందర్భంలో రెండు నెలలు రాజకీయ ఖైదీగా శిక్ష ననుభవించిన దేశభక్తులు, ప్రజా సేవకులు అయిన శ్రీ కోదండ రామమూర్తి చౌదరిగారికి మంజూరు చేయడమైనది.

ఆసాయంకాలమే అధికారులను వెంటబెట్టుకొని వెళ్ళి శ్రీ చౌదరిగారు, రైతు కూలి ప్రజారాజ్యాన్ని కోరే చౌదరిగారు, అధికాహారోత్పత్తికోసం, వనమహోత్సవాల సందర్భంలో విపరీతంగా కృషిచేసిన చౌదరిగారు, నల్లబజారు వినీల కాంతులు వికటాకృతుల్ని ఖాదీ బురఖా క్రింద భద్రపరచిన చౌదరిగారు, తన కున్న నలభై ఎకరాల మాగాణి భార్యపేర పెట్టి, రాజకీయ బాధితుడుగా ఐదెకరాలు సంపాదించిన శ్రీ శ్రీ కోదండ రామమూర్తి చౌదరిగారు, వెంకడి అనుభవంలో ఉన్న నాలుగెకరాల మాగాణి, దానికి ఈశాన్యంగా ఉన్న వాడలోని ఒక ఎకరం, వెరశి ఐదెకరాల భూమిని స్వాధీన పరచుకొన్నాడు.

సొరతీగ లెండిపోయినై. పొట్లపాదు ఆకులు రాల్చేసింది. దుక్కిటెద్దు దీనంగా చూస్తోంది. వెంకడు మూటముల్లె సర్ది ఆడదాని నెత్తిన పెట్టి,

"కదుల్తాదా, మెదుల్తాదా కయ్య నోరు దొంగిలితా రన్నవ్, సూశావా కయ్యదొంగలుండారు."

ఆడది కళ్ళజోడు కయ్య దొంగల వంక చూసింది. పొడుగు లాల్చీల పెద్ద మనుషులు వెంకడి దుక్కిని కొని తోలుకుపోతున్నారు.

"కూడు లేకుంటే మానె గంజేనా కాసుకోవచ్చు పదరా రంగ మెల్లామ్" అనేసింది ఆడది.

వెంకడు కృష్ణనీరు పుక్కిలించి ప్రయాణమైనాడు. కాని కృష్ణ నిర్మలంగానే ప్రవహిస్తోంది.